ఫిబ్రవరి 25 :

"మీది మరీ చాదస్తమండీ! ఆఫీసు పనిలో మీతోపాటు లేటవర్స్‌లో కూచుని మీకు హెల్ప్ చేశానే అనుకోండి, అంతమాత్రాన హోటల్‌కి లాక్కొచ్చి కాఫీ ఇప్పించాలా?

"మన అటెండర్ వీర్రాజుని తెమ్మంటే తెచ్చేవాడుగా. అయినా సెక్షన్‌లు వేరయినా ఒకే ఆఫీసు వాళ్లం, మనలో మనకి ఈ పట్టింపు లేమిటండీ?"

"అందుకోసమే కాదు, మీరు నాతో ఏదో చెబ్దామనుకున్నారులా ఉంది, వీర్రాజు పక్కనే ఉన్నాడు గనక చెప్పలేకపోయారేమోననీ, ఇక్కడైతే మనకు తెలిసున్న వాళ్లు ఎవరూ ఉండదు కదాని ..."

"అదా ... ఏం లేదులెండి, తర్వాత చెప్తానులెండి!"

* * *

మార్చి, 14 :

"మీకు ఫార్మాలిటీస్ ఎక్కువండీ! మీకు కావలసిన రికార్డేదో నాకు చెబితే తెచ్చిపెట్టేవాణ్నిగా.. ఈ రికార్డ్స్ రూంలో గాలీ, వెలుతురూ సరిగ్గా ఉండి చావవు. వీర్రాజుకి చెబితే 'ఆ గదిలోకి వెళ్లి మీక్కావలసింది నేను తేలేను, సరిగ్గా ఏదీ కనబడిచావదూ' అని మమ్మల్నే వెదుక్కోమంటాడు. మీరు కూడా అవస్థ పడ్డం ఎందుకు? మీక్కావలసింది నేను వెదుకుతానుగా ... మీరు బయటకు వెళ్లండి!"

"దగ్గర్లో ఎవరూ లేరనీ, చీకటిగా ఉందని మరీ మరీ నొక్కి చెబుతున్నారు. 'కౌగలించుకుని గాట్టిగా ముద్దు పెట్టేస్తా'నని బెదిరిస్తున్నారా?"

"ఛ! ఛ! ... మీరు తప్పుగా అర్థం చేసుకుంటున్నారు మేడమ్, నేనలాంటి వాడిని కాదని మీకు తెలీదా?"

* * *

జూన్, 8 :

విమల పద్ధతి నాకు నచ్చలేదు.

తనంటే నాకు బోలెడు ఇష్టమని గ్రహించదేం? ఆమెని తనెంతగా ఆరాధిస్తున్నాడో తెలుసుకోదేం? మా పరిచయంలో తనతో ఎన్నెన్ని గంటలు, రోజులు ఎన్నెన్ని కబుర్లు చెప్పాను?

'నిన్ను ప్రేమిస్తున్నాను' అని నేను నోరు విప్పి

# ప్రపోజల్

శృంగార వీధి



చెప్పలేదు కానీ నా భయం నాది. 'నువ్విలాటి వాడివనుకోలేదు. స్నేహంగా, సన్నిహితంగా దగ్గరకు వస్తే ఇలా ప్రవర్తిస్తావా' అని ఝాడిస్తే? ఈ భయమే లేకపోతే మనం పెళ్లి చేసుకుందామని ఎప్పుడో ప్రపోజ్ చేసేవాణ్ని.

కానీ ఆర్నెల్ల మా స్నేహానికి విలువివ్వకుండా, మొన్న శనివారం ఆఫీసు ఫంక్షన్లో మోహన్‌గాడితో కబుర్లలో మునిగిపోయింది. వాళ్ల పక్కకి వెళ్లి నిలబడితే కనీసం చూడనైనా చూడలేదు. పలకరిస్తే మొహమాటానికి ఓ చిరునవ్వు పడేసి, మళ్లీ వాడితో కబుర్లలో పడింది. నాకూ కోపం వచ్చింది. ఉక్రోషం వచ్చింది. అందుకే మర్నాడు వాళ్ల సెక్షన్‌కెళ్లి తనని పలకరించకుండానే శాంతితో కబుర్లు చెప్పాను. బోలెడు జోక్స్ వేశాను. అఫ్‌కోర్స్, ఒకటి రెండుసార్లు నవ్వుతూ నవ్వుతూ శాంతి భుజమ్మీద చేయి కూడా వేశాను. ఇదంతా విమలనుడికిద్దామనే! అంతమాత్రానికే ఆవిడకి కోపం వచ్చిందిట. నాతో మాటలు మానేసింది.

రెండ్రోజులయ్యాక శాంతి వచ్చి, "విమల చాలా ఫీలవుతోంది. వెళ్లి నచ్చచెప్పు!" అని చెప్పింది.

చిలికి చిలికి గాలివానవుతుందని భయపడి నేనే నిన్న మళ్లీ వెళ్లాను తన దగ్గరికి. టైము లేదంది., ఊరెళ్లుతోందట. ఆఫీసులో పని పూర్తి చేస్తే గానీ లీవు ఇవ్వనన్నాడట ఆఫీసరు. ఆ పనేదో నేను చేసిపెడతానన్నాను. అక్కర్లేదంది. ఏ ఊరు వెళ్తున్నావంటే వైజాగంది. వాళ్ల అక్కయ్య కూతురు బారసాల హఠాత్తుగా పెట్టారట. వెంటనే వెళ్లి టికెట్ బుక్ చేసిందట. 'ఎల్టీసీ ఉపయోగించు కుందామని ఫస్ట్‌క్లాస్‌లో కొన్నాను' అని చెప్పి ఫైళ్లలో మునిగిపోయింది.

సాయంత్రం నాంపల్లి స్టేషన్‌కెళ్లాను. ట్రెయినంతా వెదికాను. ఫస్టుక్లాసు లిస్టుల్లో తన పేరే కనబడలేదు. నా మనసంతా ఆందోళన. 'అసలు గోదావరేనా? లేక వేరే ట్రెయినా? నేను పొరపాటుగా విన్నానా?' అని ఆలోచిస్తుండగా విమల కనబడింది. "ఏం ఇలా వచ్చారు? మీ వాళ్లెవరైనా వెళ్తున్నారా?" అని అంది సీరియస్‌గా. వెటకారం లేదు. "మీతో మాట్లాడాలనే వచ్చాను" అంటే ఆశ్చర్యపడింది. నేను మాట్లాడబోయేసరికి విమల ఫస్టుక్లాసు పాసెంజర్ల లిస్టు చూసి, "ఇక్కడెందుకు, లోపల కూచుని మాట్లాడుకుందాం రండి!" అంటూ కంపార్టుమెంటులోకి ఎక్కింది. 'ఎఫ్' కాబిన్‌లోకి వెళ్తూ, "ఎవరో 'మిస్టర్ అండ్ మిసెస్ రావ్' అని ఉంది. సికింద్రాబాదులో ఎక్కుతారు కాబోలు. అంతవరకూ మనం కూచుని మాట్లాడుకోవచ్చు. రండి!" అంది.

నాకు లోపల్నించి దుఃఖం తన్నుకొస్తోంది. మాటలు తట్టడంలేదు. తట్టినవి పెగలడంలేదు. సికింద్రాబాదు వచ్చేలోగా చెప్పగలనో, లేదోనన్న జంకు ఎక్కువైనకొద్దీ, ఏం మాట్లాడాలో కూడా తెలీకుండా పోతోంది. నా పెదాలు కదులుతున్నాయి గానీ వాటి అర్థం నాకే తెలీటంలేదు. విమలకింకేం అర్థమవుతుంది? అసలు విమల వింటోందో, లేదో కూడా నాకు తెలీటంలేదు.

సికింద్రాబాద్‌లో టీటీఈ వచ్చాడు.

విమల తన పర్సులోంచి టికెట్ తీసి ఇచ్చింది.

"మిస్టర్ అండ్ మిసెస్ రావ్" అంటూ మా ఇద్దర్నీ చూసి తన లిస్టు చూసుకుని టిక్కు పెట్టుకుని పక్క కాబిన్‌లోకి వెళ్లిపోయాడు. రైలు కదిలింది.

నాకు మతిపోయింది. నోరు వెళ్లబెట్టుకుని నేనుంటే విమల లేచి కిటికీ తలుపు బోల్టు వేసి, "రండి రావుగారూ! మీకు పై బెర్తు కావాలా? కిందిది కావాలా?" అని అంది నవ్వుతూ. నాకర్థమయింది.

"నేను స్టేషన్‌కొస్తానని ఇంత పక్కాగా ఎలా తెలుసు?" అనడిగాను.

"మీరెంత బెంగ పెట్టుకున్నదీ శాంతి చెప్పింది. ఎలా రాకుండా ఉంటారని మీకూ టికెట్ తీసుకున్నాను. అన్నట్టు మీకు అనుకోని ప్రయాణం. వైజాగ్‌లో మీకు బట్టలు కొనచ్చు. అందాకా ఈ బట్టలు మాపుకోకండి!"

"మీవీ మాపుకోకండి!" అన్నాను వెక్కిరిస్తూ.

"సిగ్గులేకపోతే సరి. మొహం చూడండి బభ్రాజమానంలా! ఎక్కడ దొరికార్రా బాబూ ఈ బుద్ధావతారం!" అంది నుదురు కొట్టుకుంటూ.

ఆమెని దగ్గరికి లాక్కుని, "వీడు భజన గోవిందం కూడా!" అన్నాను.

తెల్లారుఝామున అనకాపల్లి చేరుతుండగా కాబోలు, "శోభనప్పెళ్లి కొడుకుగారూ! ఇప్పటికైనా పెళ్లి ప్రపోజల్ చేస్తారా?" అంది నా చెవిని మునిపంటితో కొరుకుతూ.

Ⓟ

